




# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )








Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక :200 | బుధవారం 23 జులై 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695


## ఇంటి సమస్య పరిష్కరించుకోలేని మీరు రాష్ట్ర సమస్యలు తీరుస్తారా?..

### బీఆర్ఎస్ పై అద్దంకి



**న్యూస్ డెస్క్, 22 జూలై (కెరటం న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీరబాదుడుకు భయపడే కేసీఆర్ అసెంబ్లీకి రావడంలేదని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. ఏ చిన్న సందు దొరుకినా దూరిపోయే కేసీఆర్ తనకు చెప్పుకోవడానికి ఏమి లేకనే అసెంబ్లీకి ముఖం చాటేస్తున్నారని విమర్శించారు.

## కేంద్ర నిర్లక్ష్యమే పహల్గామ్‌లో ఉగ్రదాడికి కారణం

### సీపీఐ నారాయణ



**న్యూస్ డెస్క్, 22 జూలై (కెరటం న్యూస్):** జమ్ము కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడికి కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. మంగళవారం పహల్గామ్ లో సయ్యద్ అజీజ్ పాషా తో కలసి నారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఇక్కడ ప్రతి రెండు వందల గజాలకు ఒక ఆర్మీ క్యాంపు ఉందని చెప్పారు.



# సన్న బియ్యంలో 50% నూకలే

- పేదలకు పాలిష్ చేసిన దొడ్డు బియ్యం ఇస్తున్నారు
- కేసీఆర్ పాలనతోనే రాష్ట్రానికి ఆర్థిక స్థిరత్వం వచ్చింది
- రాష్ట్ర తలసరి ఆదాయంలో భారీ పెరుగుదల కేసీఆర్ పాలనకు ఫలితం
- నాణ్యమైన బియ్యం ఇవ్వాలి.. కొత్త కార్డుదారులకు కోటా వెంటనే ఇవ్వాలి
- నాణ్యమైన బియ్యం ఇవ్వకపోతే ఉద్యమిస్తాం: హరీష్ రావు

**న్యూస్ డెస్క్, 22 జూలై (కెరటం న్యూస్):** రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యంలో 40 నుంచి 50 శాతం నూకలు ఉంటున్నాయని, దొడ్డు బియ్యాన్ని పాలిష్ చేసి సన్న బియ్యంగా పంపిణీ చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లాలో ప్రజల నుంచి పెద్ద మొత్తంలో ఫిర్యాదులు వస్తున్నాయని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు సత్వర పరిష్కారం చూపించాలని, ఇచ్చిన మాట ప్రకారం, మంచి మంచి సన్న బియ్యాన్ని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకేసారి పంపిణీ చేసిన 3 నెలల కోటా సన్న బియ్యంలో నాణ్యత లోపించడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ అనేది నిరంతర ప్రక్రియ అని, ఏ ప్రభుత్వం ఉన్నా కొత్త కార్డులు ఇస్తూ ఉంటారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 6,47,479 రేషన్ కార్డులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. గతంలో కార్డు మీద నాలుగు కేజీల బియ్యం ఇస్తే, బీఆర్ఎస్ ఆరు కేజీల బియ్యం కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మందికి ఇచ్చిందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో సన్న బియ్యం అందించి, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ అన్నారు. కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారికి కూడా ఈ నెల నుంచే సన్న బియ్యం కోటా అందించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ లో నాణ్యమైన బియ్యాన్ని ప్రజలకు అందించాలన్నారు. జిల్లా అభివృద్ధి కోసం కలిసి కృషి చేద్దామని చెప్పారు.

## రాష్ట్రం నుంచి ఎన్నికైన భాజపా ఎంపీలు రాజీనామా చేయాలి

### : మంత్రి పొన్నం



**న్యూస్ డెస్క్, 22 జూలై (కెరటం న్యూస్):** బీసీలకు 42శాతం రిజర్వేషన్ల పెంపు సాధ్యమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

"రామచందర్‌రావు మరోసారి తన నిజస్వరూపం బయట పెట్టుకున్నారు. బీసీల రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చడం అసాధ్యం అంటున్నారు. పొరుగు రాష్ట్రం తమిళనాడులో రిజర్వేషన్లు పెంచారు.

## బీజేపీ రాజకీయ ఒత్తిడితోనే ఉప రాష్ట్రపతి రాజీనామా :మల్లు రవి



**న్యూస్ డెస్క్, 22 జూలై (కెరటం న్యూస్):** ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ రాజీనామా అంశం దేశ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ధన్ ఖడ్ అనూహ్య రాజీనామాపై కాంగ్రెస్ పార్టీ పలు అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో ఎంపీ మల్లు రవి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజ్యసభలో తొలిరోజు సమావేశానికి అధ్యక్షత వహించిన ఉపరాష్ట్రపతి సాయంత్రానికల్లా రాజీనామా చేయడానికి బీజేపీ రాజకీయ ఒత్తిడితోనే ఉప రాష్ట్రపతి తన పదవికి రాజీనామా చేశారని ఆరోపించారు. రిజైన్ చేయడానికి చెపుతున్న అనారోగ్య కారణాలు సాకేనని అసలు కారణాలు వేరే ఉన్నాయని అనుమానాలు వ్యక్తం చేశారు. ఢిల్లీలో మిడియాతో మాట్లాడిన మల్లు రవి కీలక వ్యాఖ్యలు చేశారు.

# చేసిన పనులు ప్రజల్లోకి వెళ్లట్లేదు

- ఎంత పని చేసిన ..గోరంత కూడా చెప్పుకోలేకపోతున్నాం
- రాష్ట్ర అభివృద్ధికి సీఎం రేవంత్ సారథ్యంలో విశేష పథకాలు
- 60 వేల ఉద్యోగాలు.. సంక్షేమంలో తెలంగాణ ముందంజ
- పాత ప్రభుత్వం చేయనివి ఏడాదిన్నరలో చేసి చూపించాం
- పౌర సంబంధాల శాఖ బాధ్యత పెద్దది: ప్రజల్లోకి పనుల్ని తీసుకెళ్లాలి

: మంత్రి పొంగులేటి



## నిరూపించూ.. ముక్కు నేలకు రాస్తా

### : ఎంపీ ఈటలకు పాడి కౌశిక్‌రెడ్డి సవాల్



**న్యూస్ డెస్క్, 22 జూలై (కెరటం న్యూస్):** తెలంగాణ బీజేపీ లో ఇంటర్నల్ వార్ తారా స్థాయికి చేరింది. పార్టీలో వరుస పంచాయితీలు హైకమాండ్‌కు తలనొప్పులు తెచ్చి పెడుతున్నాయి. ఓ వైపు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య గొడవ సద్దుమణగడంతో.. మరో లొల్లి తెర మీదకు వచ్చింది. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ , కేంద్ర మంత్రి బండి సంజయ్ మధ్య డైలాగ్ వార్ కొనసాగుతోంది. అసలే స్థానిక ఎన్నికల వేళ పార్టీలో ఈ గొడవలేంటని ముఖ్య నాయకులు, కేడార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి , ఎంపీ ఈటల రాజేందర్‌ను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు.

## ఎయిర్ ఇండియా విమానంలో మంటలు

### : ఢిల్లీ విమానాశ్రయంలో కలకలం

**న్యూస్ డెస్క్, 22 జూలై (కెరటం న్యూస్):** ఎయిర్ ఇండియా ఫ్లయిట్.. ఈ మాట వింటే చాలు అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన గుర్తుకొస్తుంది. అంతే కాదు ఇటీవల వరసగా జరుగుతున్న విమాన ప్రమాదాలు సైతం భయాన్ని పుట్టిస్తున్నాయి. ఇలాంటి టైంలో.. 2025, జూలై 22వ తేదీ సాయంత్రం ఢిల్లీ ఎయిర్ పోర్టులో జరిగిన ఘటన అందర్నీ భయాందోళనలకు గురి చేసింది



## కేసీఆర్‌కు పేరు వస్తుందనే ఆ పని చేయట్లే : కేటీఆర్

కేసీఆర్ కిట్‌ల వల్లే మాతా శిశు మరణాలు తగ్గినయ్

రేవంత్ సర్కార్‌కు కేసీఆర్ మీద ద్వేషమే పనులు ఆపించేలా చేస్తోంది

20 నెలలుగా కేసీఆర్ కిట్‌లు ఇవ్వకపోవడం దుర్మార్గం - కేటీఆర్



**న్యూస్ డెస్క్, 22 జూలై (కెరటం న్యూస్):** కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందన్న ఉక్రోశంతోనే రేవంత్ ప్రభుత్వం కేసీఆర్ కిట్లను ఇవ్వడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన కేసీఆర్ కిట్లతో మాతా శిశు మరణాలు గణనీయంగా తగ్గి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగాయని తెలిపారు.

## తెలంగాణ మోడల్ ను దేశం ఫాలో అవుతుంది..

### : భట్టి విక్రమార్క



**న్యూస్ డెస్క్, 22 జూలై (కెరటం న్యూస్):** తెలంగాణలో కులగణన సర్వేపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సెక్రటేరియట్ మీడియా పాయింట్ లో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతతో సోషియో ఎకనామిక్, పొలిటికల్, క్యాస్ట్ సర్వే చేసిందన్నారు. సర్వే మొదలు పెట్టినప్పుడు అనేక సందేహాలు, అవసరం లేదని కొన్ని రాజకీయ పార్టీలు అన్నాయి.. రాష్ట్ర ప్రభుత్వం చేసిన సర్వే చారిత్రాత్మక సర్వేగా దేశంలో నిలబడుతుంది.. పోస్ట్ క్యాస్ట్, ప్రీ క్యాస్ట్ సర్వే రిపోర్ట్ అసెంబ్లీలో పెట్టాం.. రాహుల్ గాంధీ ఆలోచనను భారత ప్రభుత్వం తప్పనిసరిగా ఒప్పుకునే పరిస్థితి వచ్చిందన్నారు.

# ఫ్లైట్ మోడ్ సీఎం

ఢిల్లీ పర్యటనల్లో హాఫ్ సెంచరీ కొట్టారు

బీసీలకు న్యాయం కావాలి, మాటలతో కాదు చట్టంతో ఇవ్వాలి

బీజేపీకి బీసీ రిజర్వేషన్లు ఓటు బ్యాంకేనా? -ఉత్తరాదిలో ఒక విధంగా, దక్షిణాదిలో మరోలా? - ఎమ్మెల్సీ కవిత



**న్యూస్ డెస్క్, 22 జూలై (కెరటం న్యూస్):** బీసీ రిజర్వేషన్ల పై రెండు జాతీయ పార్టీలు తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. తాజాగా బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ చేసిన వ్యాఖ్యలు, బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు మాట్లాతున్న అంశాలను చూసిన కూడా చాలా బాధాకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

# సన్న బియ్యంలో 50% నూకలే

కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారికి కూడా ఈ నెల నుంచే సన్న బియ్యం కోటా అందించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ లో నాణ్యమైన బియ్యాన్ని ప్రజలకు అందించాలన్నారు. జిల్లా అభివృద్ధి కోసం కలిసి కృషి చేద్దామని చెప్పారు.

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అపూర్వ ప్రగతి సాధించింది

2013 నుంచి 2024 వరకు రాష్ట్ర తలసరి ఆదాయం 84.3 శాతం పెరిగిందని అన్నారు. తెలంగాణ సాధించిన విజయాన్ని నిన్న పార్లమెంటులో ఆర్థిక శాఖ మంత్రి కూడా నిర్ధారించారని స్పష్టం చేశారు.తలసరి ఆదాయంలో తెలంగాణ దేశంలోని ప్రధాన రాష్ట్రాలలో మూడో స్థానంలో నిలిచిందని ఆర్థిక మంత్రి తెలిపారని హరీశ్‌రావు అన్నారు. ఇది ప్రజల జీవన ప్రమాణాలు, వినియోగ శక్తి పెరుగుదలకు స్పష్టమైన సూచికగా నిలుస్తుందని తెలిపారు.

తెలంగాణ ఈ వృద్ధి సాధించేందుకు కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రధాన కారణాలు అని పేర్కొన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతు బంధు, రైతు బీమా, ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఐటీ, ఇండస్ట్రీ పాలసీలు, గ్రామీణ అభివృద్ధి, పట్టణ అభివృద్ధి, ఉద్యోగ కల్పన వంటి అనేక కార్యక్రమాల వల్లే ఈ ఆర్థిక స్థిరత్వం సాధ్యమైందని వివరించారు. ఇది బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు ఉన్న విజనరీ పాలనకు నిదర్శనమని అన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రగతి ప్రస్థానానికి ఇది మరో సాక్ష్యమని చెప్పారు.

# చేసిన పనులు ప్రజల్లోకి వెళ్లట్లేదు

## : మంత్రి పొంగులేటి

**న్యూస్ డెస్క్, 22 జూలై (కెరటం న్యూస్):** రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి విస్తృతంగా పథకాలను ప్రవేశపెట్టి కొండంత పని చేస్తే.. గోరంత కూడా ప్రజలకు చెప్పుకోలేకపోతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సచివాలయంలో సమాచార, పౌర సంబంధాల శాక కమిషనర్ సీహెచ్. ప్రియాంక కలిసి ఆయా జిల్లాల సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ఏడాదిన్నర కాలంలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తూ ముందుకెళ్తున్నా.. చేసిన మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నాయని అన్నారు. నేడు ప్రతిపక్షంలో ఉన్న పార్టీ పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో చేయని వాటిని చేసినట్లుగా గోబెల్ ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టిందని ఆరోపించారు. ప్రతిపక్షంలో కూడా అదే ఒరవడిని కొనసాగిస్తూ ప్రజల కళ్లకు గంతలు కడుతోందని విమర్శించారు. తమ ప్రభుత్వం చేసిన పనులను కూడా పూర్తిగా చెప్పుకోలేకపోతోందని పొంగులేటి అన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా ఇతర అంశాలలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేశామని అన్నారు. 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసి దేశంలోనే ఇంత భారీ నియామకాలు చేపట్టిన రాష్ట్రంగా తెలంగాణను అగ్రపథంలో నిలిపామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పేదలకు సన్నబియ్యం, మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా పెంపు, రుణమాఫీ, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, డైట్ ఛార్జీలు 40 శాతం పెంపు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల పంపిణీ ఇలా రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ఎంతో చేశామన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేనిది తాము ఏడాదిన్నరలోనే చేసి చూపించామని కామెంట్ చేశారు. కేసీఆర్ పేదలకు రేషన్ కార్డులు, ఇండ్లు ఇవ్వాలనే ఆలోచన కూడా చేయలేదని ఆరోపించారు. పదేళ్లుగా రేషన్ కార్డులలో పేరు నమోదు కోసం ఎదురుచూస్తున్న 15 లక్షల మందిని కొత్తగా పాత కార్డులలో చేర్చామని మంత్రి పొంగులేటి అన్నారు. కొత్తగా 7 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులదేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వారికి దిశానిర్దేశం చేశారు.

# బీజేపీ రాజకీయ ఒత్తిడితోనే ఉప రాష్ట్రపతి రాజీనామా : మల్లురవి



బిహార్ ఎన్నికల కోసమే ఇదంతా జరుగుతోందని.. జగదీప్ ధన్ ఖడ్ స్థానంలో మరొకరిని కూర్చోబెట్టి తద్వారా బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందాలని బీజేపీ ప్రయత్నిస్తోందనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. రెండో సారి జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీకి కిరణ్ రిజిజు, జేపీ నడ్డా హాజరు కాలేదని ఇక్కడే ఏదో గూడుపుఠాణి జరిగిందని ఆరోపించారు. ఆపరేషన్ సింధూర్ పై ప్రజలకు వాస్తవాలు ప్రభుత్వం చెప్పాలన్నారు. అందరూ మద్దతిచ్చినప్పుడు నిజానిజాలేంటో చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు.

# ఇంటి సమస్య పరిష్కరించుకోలేని మీరు రాష్ట్ర సమస్యలు తీరుస్తారా?

## బీఆర్ఎస్ పై అద్దంకి

**న్యూస్ డెస్క్, 22 జూలై (కెరటం న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీరబాదుడుకు భయపడే కేసీఆర్ అసెంబ్లీకి రావడంలేదని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. ఏ చిన్న సందు దొరుకినా దూరిపోయే కేసీఆర్ తనకు చెప్పుకోవడానికి ఏమి లేకనే అసెంబ్లీకి ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. ఇవాళ గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన అద్దంకి.. దొమ్మిదిన్నరేళ్లు తెలంగాణ సెంటిమెంట్ గూర్తుకు రాని వాళ్లు ఇవాళ తెలంగాణ పేరుతో బయటకు వస్తున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ లో ఉద్యమకారులు అంటే కేవలం నలుగురేనని ప్రజలు మిమ్మల్ని గమనిస్తున్నారన్నారు. నిజంగా బీఆర్ఎస్ ప్రజల పక్షమే అయితే వారికి ఈ దుర్గతి పట్టేదే కాదన్నారు. ప్రతి సందర్భంలో ప్రజలను అవమానించిన చరిత్ర బీఆర్ఎస్ దన్నారు. కేసీఆర్ కుటుంబంలో నెలకొన్న అంతర్గత కుమ్ములాట వల్ల రాష్ట్రంలో అశాంతి నెలకొంటున్నదని విమర్శించారు. మొదట మీ కుటుంబ సమస్యలను పరిష్కరించుకోలేని మీరు రాష్ట్ర సమస్యలను ఏం పరిష్కరిస్తారని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ హయాంలో రేవంత్ రెడ్డి, కోదండరెడ్డి, మందకృష్ణమాదిగ వంటి వారిని అరెస్టు చేసిన మీకు ఇవాళ కేసులు, అరెస్టులు అంటే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. లక్షల కోట్లు దోచుకున్న దొంగలు మీరే బయట తిరుగుతుంటే తెలంగాణ సమాజం మిమ్మల్నెందుకు సహించాలన్నారు. మిడిమిడి జ్ఞానంతో కాళేశ్వరం కట్టారని ఇప్పుడు ఇరు రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. కాళేశ్వరం ఇంత గొప్ప ప్రాజెక్టు అని చెప్పుకున్న వారు ఇప్పుడు ఆ గొప్పతనం మాదే అని చెప్పుకోవడానికి ఒక్కరూ ముందుకు రావడం లేదన్నారు. రాష్ట్ర ఆర్థిక వెసులుబాటు లేని కారణంగానే కొన్ని పథకాల అమలు ఆలస్యం అవుతోందని త్వరలోనే అన్ని పథకాలు అమలు అవుతాయన్నారు. తొమ్మిదేళ్లుగా మీరిచ్చిన హామీలు నెరవేర్చకుండా ఇవాళ కాంగ్రెస్ హామీలపై మాట్లాడితే నడువదన్నారు. కొన్ని మీడియా సంస్థలకు తెలంగాణ ఏర్పాటు ఇష్టం లేకపోవచ్చు. కొన్ని మీడియా సంస్థలు బీఆర్ఎస్ నాయకులు ఇచ్చే తాయిలాల కోరకు వారి అబద్ధాలు ప్రచారాలను చేయవద్దన్నారు. దీని వల్ల తెలంగాణ సమాజానికి నష్టం జరుగుతుందన్నారు. మీడియా నిక్కచ్చిగా వ్యవహరించడం రాజ్యాంగబద్ధమైన హక్కు అన్నారు. మీడియాను ఎవ్వరేమీ చేయలేరని ఎవరైనా వస్తే మీకు అండగా మేముంటామన్నారు.

# కేసీఆర్‌కు పేరు వస్తుందనే ఆ పని చేయట్లే - కేటీఆర్



తన పుట్టిన రోజు సందర్భంగా కేసీఆర్ కిట్లను ఇస్తానని ప్రకటించిన కేటీఆర్.. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన తల్లీబిడ్డలకు తెలంగాణ భవన్‌లో కేసీఆర్ కిట్లను అందించారు. గత 20 నెలల నుంచి కేసీఆర్ కిట్లను ఇవ్వకపోవడంతో చాలా మంది తల్లులు బాధపడుతున్నారని కేటీఆర్ చెప్పారు. అందుకే తన పుట్టిన రోజు సందర్భంగా 5 వేల మంది తల్లులకు సిరిసిల్లలో కేసీఆర్ కిట్లను ఇవ్వనున్నట్లు తెలిపారు.

2014 కు ముందు నేను రాను బిడ్డో సర్కారు దవఖానాకు అని జనాలు భయపడేవారన్న కేటీఆర్.. ముఖ్యమంత్రిగా కేసీఆర్ తీసుకున్న చర్యలతో సర్కార్ దవాఖానాకే పోవాలని జనాలంతా అనుకున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలను మార్చిన కేసీఆర్ కిట్లను గత 20 నెలల నుంచి రేవంత్ సర్కార్ ఇవ్వకపోవడం దుర్మార్గం అన్నారు. కేసీఆర్ మీద ఉన్న అంతులేని ద్వేషం, కోపమే ఇందుకు కారణమని విమర్శించారు.

# నిరూపించూ.. ముక్కు నేలకు రాస్తా : ఎంపీ ఈటలకు పాడి కౌశిక్‌రెడ్డి సవాల్

**న్యూస్ డెస్క్, 22 జూలై (కెరటం న్యూస్):** తెలంగాణ బీజేపీ లో ఇంటర్నల్ వార్ తారా స్థాయికి చేరింది. పార్టీలో వరుస పంచాయితీలు హైకమాండ్‌కు తలనొప్పుడు తెచ్చి పెడుతున్నాయి. ఓ వైపు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్,కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య గొడవ సద్దుమణగడంతో.. మరో లొల్లి తెర మీదకు వచ్చింది. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ , కేంద్ర మంత్రి బండి సంజయ్ మధ్య డైలాగ్ వార్ కొనసాగుతోంది. అసలే స్థానిక ఎన్నికల వేళ పార్టీలో ఈ గొడవలేంటని ముఖ్య నాయకులు, కేడార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి , ఎంపీ ఈటల రాజేందర్‌ను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు.

కేసీఆర్‌తో పాటు హుజూరాబాద్ ప్రజలను ఈటల రాజేందర్ బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటూ కుట్రలు చేస్తూ మోసం ఆరోపించారు. రేపటి రోజు కూడా బీజేపీని కూడా ఎలా మోసం చేస్తాడో బయటపడుతుందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో తాను ఉన్నప్పుడు ప్రతి ప్రభుత్వ అధికారిక కార్యక్రమానికి ఈటలను ఆహ్వానించినా అహంకారంతో హాజరుకాక.. నేడు పిలువలేదని తనపై అభాండాలు వేయడం సరికాదన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల సమయంలో శిలా ఫలాకాలపై నాడు ఎమ్మెల్యేగా ఉన్న ఈటల పేరు లేకపోతే తాను ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు. లేకపోతే ఎంపీ పదవికి రాజీనామా చేయాలన్నారు. ఏది పడితే అది.. నోటికొచ్చినట్లుగా మాట్లాడితే ఊరుకోబోమని, తాము ఖాళీగా చేతులు కట్టుకుని కూర్చోలేదని కౌశిక్ రెడ్డి అన్నారు.


# ఫ్లైట్ మోడ్ సీఎం -ఢిల్లీ పర్యటనల్లో హాఫ్ సెంచరీ కొట్టారు

**న్యూస్ డెస్క్, 22 జూలై (కెరటం న్యూస్):** బీసీ రిజర్వేషన్ల పై రెండు జాతీయ పార్టీలు తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. ఈ మేరకు ఆమె మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. తాజాగా బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ చేసిన వ్యాఖ్యలు, బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు మాట్లాతున్న అంశాలను చూసిన కూడా చాలా బాధాకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీ, కౌన్సిల్లో పాస్ చేసి పంపితే.. రాష్ట్రపతి వద్ద పెండింగ్ పెట్టి.. తిరిగి పంపడం లేదన్నారు. పాస్ చేయమని బిల్లుకు మతపరమైన రంగు పులిమే ప్రయత్నం బీజేపీ చేసిందని మండిపడ్డారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. గుజరాత్‌లో ఎలాంటి రిజర్వేషన్లు ఇచ్చారో అందరికీ తెలుసన్నారు. తెలంగాణకు వచ్చేసరికి ఇక్కడ ఓట్లు రావని తెలిసే బీజేపీ ఇటువంటి ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు.

ఉత్తరాది రాష్ట్రాల్లో 50 శాతానికి పైగా రిజర్వేషన్లు బీజేపీ అమలు చేస్తోందని, దక్షిణాది రాష్ట్రాలకు వచ్చేసరికి కోర్టులో ఉందని సాకులు చెప్తోందని ఫైర్ అయ్యారు. బీసీ బిడ్డలకు రిజర్వేషన్లకు దూరంగా ఉంచడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అదేవిధంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఫ్లైట్ మోడ్ సీఎం అని హాట్ కామెంట్స్ చేశారు. నేడు కూడా ఆయన ఢిల్లీకి పోతున్నారు.. ఇప్పటికే ఢిల్లీకి పోవడంలో హాఫ్ సెంచరీ కొట్టారిన తీవ్ర విమర్శలు చేశారు. ఇన్ని సార్లు ఢిల్లీకి పోయిన బీసీ రిజర్వేషన్లపై ప్రధాని మోడీపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేయలేదన్నారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి గట్టిగా మాట్లాడిన దాఖలాలు లేవన్నారు.

పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తామని అంటున్నారని సీఎం వ్యాఖ్యలను గుర్తుకు చేశారు. అయితే బీసీలు పార్టీల పరంగా రిజర్వేషన్లు కోరుకోవడం లేదన్నారు. అన్యాయం జరుగుతుందని వారికి తెలుసన్నారు. అందుకే చట్టబద్ధమైన, రాజ్యాంగ బద్ధమైన రిజర్వేషన్లు కోరుకుంటున్నట్లు తెలిపారు. 2018 పంచాయతీ రాజ్ చట్టం సవరించి ఆర్డినెన్స్ తీసుకొస్తామని చెప్పారో.. తక్షణమే కోర్టులో పిటిషన్ వేసి అర్డినెన్స్ తీసుకురావాలని సూచించారు. బీసీ బిడ్డలకు న్యాయం చేయాలన్నారు. తప్పించుకొని తిరుగుదామని చూస్తే.. రిజర్వేషన్లు లేకుండా స్థానిక ఎన్నికలకు పోవాలని చూస్తే.. తెలంగాణ బీసీ బిడ్డలు మిమ్మల్ని వదిలిపెట్టరని హెచ్చరించారు.

# తెలంగాణ మోడల్ ను దేశం ఫాలో అవుతుంది..



**న్యూస్ డెస్క్, 22 జూలై (కెరటం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వ సర్వే ఆధారంగా త్వరలో దేశంలో కులగణన జరుగబోతోంది.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేను కలిసి తెలంగాణ సర్వే వారికి ఇచ్చి త్వరితగతిన పార్లమెంటులో మద్దతు కూడగట్టి బీసీ రిజర్వేషన్ బిల్ పాస్ చేయించేలా ఒత్తిడి తెస్తాం.. వంద మంది లోక్ సభ సభ్యులు, ఇతర పార్టీల సభ్యులను కలిసి బిల్ పాస్ కావడానికి వారి సహకారం తీసుకుంటాం.. ఓబీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వడం న్యాయమైంది.. సహేతుకమైనదని వారి మద్దతు కూడగడుతాం.. మంచి సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.. ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు కులగణన చేస్తామని హామీ ఇచ్చారు.. దాని ప్రకారమే తెలంగాణలో అధికారంలోకి రాగానే కులగణన చేశాము..తెలంగాణ మోడల్ ను దేశం ఫాలో అవుతుంది. ఏ రాష్ట్రం అయిన కులగణన చేయాలంటే తెలంగాణను రిఫరెన్స్ గా తీసుకుంటారు.. ముఖ్యమంత్రి నాయకత్వంలో ఓ డెలిగేషన్ ముఖ్య నాయకులను కలసి మద్దతు అడుగుతాం.. 42శాతం బిసి రిజర్వేషన్లకు రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ సభ్యులు మద్దతు ఇచ్చారు.. పార్లమెంటులో కూడా ఆ పార్టీలకు చెందిన మిగతా సభ్యులు కూడా మద్దతు ఇస్తారనే నమ్మకం మాకు ఉంది.. 82 కోట్ల పేపర్లలో సర్వే వివరాలు నిక్షిప్తం అయి ఉన్నాయి. మళ్లీ కులగణనలోని కులాల వివరాలు అసెంబ్లీలో పెడతాం.. 42శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి ఆర్డినెన్స్ ముసాయిదా గవర్నర్ కు పంపాము.. మాకు నమ్మకం ఉంది..బీజేపీ రామచంద్రరావుకు దళితులు, బలహీన వర్గాలు అంటే చిన్న చూపు ఉంది.. గతంలో కొన్ని సార్లు అలాంటి ప్రయత్నాలకు ఆయన అడ్డు తగిలారు.. రాంచంద్రరావు లీగల్ నోటీసులకు భయపడే వాడు కాదు భట్టి విక్రమార్క.. సమయం వచ్చినప్పుడు లీగల్ నోటీసులకు సమాధానం చెబుతా.. బిసిలను మభ్య పెట్టె ఆలోచన మాకు లేదు.. బీఆర్ఎస్ కు ఆ అలవాటు ఉంది కాబట్టి అలాంటి మాటలు మాట్లాడుతారని విమర్శించారు.

# రాష్ట్రం నుంచి ఎన్నికైన భాజపా ఎంపీలు రాజీనామా చేయాలి: మంత్రి పొన్నం

**న్యూస్ డెస్క్, 22 జూలై (కెరటం న్యూస్):** బీసీలకు 42శాతం రిజర్వేషన్ల పెంపు సాధ్యమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

“రామచందర్‌రావు మరోసారి తన నిజస్వరూపం బయట పెట్టుకున్నారు. బీసీల రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చడం అసాధ్యం అంటున్నారు. పొరుగు రాష్ట్రం తమిళనాడులో రిజర్వేషన్లు పెంచారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన భాజపా ఎంపీలు రాజీనామా చేయాలి. ఎంపీలు రాజీనామా చేస్తే బీసీ రిజర్వేషన్లు ఎందుకు అమలుకావో చూస్తాం. బీసీ రిజర్వేషన్ల పెంపుపై కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలి. బీసీ వర్గాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం” అని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తం.. కొత్త పేర్లు కూడా యాడ్ చేస్తం

తెలంగాణలో 10 సంవత్సరాల తర్వాత కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామన్నారు. రేషన్ కార్డులో కొత్త పేర్లను కూడా యాడ్ చేసేందుకు అవకాశం కల్పించామని చెప్పారు. హైదరాబాద్?లో 43 వేల కొత్త రేషన్ కార్డులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇంకా లక్షకు పైగా దరఖాస్తులు పెండింగ్?లో ఉన్నాయన్నారు. హైదరాబాద్ జిల్లాల్లో అర్హుల ఎంపిక ప్రక్రియ కొంత ఆలస్యంగా జరుగుతుందని.. పెండింగ్ అప్లికేషన్ ప్రాసెస్ వెరిఫికేషన్ తొందరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశిస్తున్నానన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని పని చేయాలని సూచించారు. ఎక్కడ జాప్యం చేయకుండా.. సివిల్ సప్లయ్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయం చేసుకొని వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

# కేంద్ర నిర్లక్ష్యమే పహల్గామ్‌లో ఉగ్రదాడికి కారణం -సీపీఐ నారాయణ

**న్యూస్ డెస్క్, 22 జూలై (కెరటం న్యూస్): జూ**జమ్ము కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడికి కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. మంగళవారం పహల్గామ్ లో సయ్యద్ అజీజ్ పాషా తో కలసి నారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఇక్కడ ప్రతి రెండు వందల గజాలకు ఒక ఆర్మీ క్యాంపు ఉందని చెప్పారు. ఇలాంటి చోట ఉగ్రవాదులు విచ్చల విడిగా కాల్పులకు తెగ బడ్డారు అంటే కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమని అన్నారు.

ఆపరేషన్ సిందూర్ పై ఎన్నో అనుమానాలు ఉన్నాయని నారాయణ అన్నారు. ఈ అనుమానాలు నివృత్తి కావాల్సి ఉందన్నారు. ఈ మేరకు పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ పై పార్లమెంట్‌లో చర్చ జరగాలని డిమాండ్ చేశారు. ఏమి జరిగిందనేది తెలియాలని వెల్లడించారు. ఘటన జరిగిన తర్వాత పార్లమెంట్‌లో చర్చ జరగకుండానే.. ఎంపీల బృందాన్ని ప్రపంచం అంత పంపించారని అన్నారు. ఇదేమన్న విహారయాత్ర అని ప్రశ్నించారు. తాము ఏడు యుద్ధ విమానాలను కూల్చివేశామని పాకిస్తాన్ చెప్పుకుంటుందని, సర్జికల్ స్ట్రైక్ వాళ్లు చేయలేదని చెబుతోందని తెలిపారు. మన వైపు నుంచి మాత్రం విజయం సాధించామని చెబుతున్నారని పేర్కొన్నారు. వీటిపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని, అప్పుడు ప్రజలకు ఒక విశ్వాసం వస్తోందన్నారు.


# ఎయిర్ ఇండియా విమానంలో మంటలు : ఢిల్లీ విమానాశ్రయంలో కలకలం

**న్యూస్ డెస్క్, 22 జూలై (కెరటం న్యూస్):** ఎయిర్ ఇండియా ఫ్లయిట్.. ఈ మాట వింటే చాలు అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన గుర్తుకొస్తుంది. అంతే కాదు ఇటీవల వరసగా జరుగుతున్న విమాన ప్రమాదాలు సైతం భయాన్ని పుట్టిస్తున్నాయి. ఇలాంటి టైంలో.. 2025, జూలై 22వ తేదీ సాయంత్రం ఢిల్లీ ఎయిర్ పోర్టులో జరిగిన ఘటన అందర్నీ భయాందోళనలకు గురి చేసింది. పరుగులు పెట్టించింది. జస్ట్ మిస్.. లేకపోతే బీభత్సం జరిగేది.. మరో అహ్మదాబాద్ ఘటన జరిగేది అంటున్నారు. ఘటన పూర్తి వివరాల్లోకి వెళితే..ఏఐ 317 నెంబర్ ఎయిర్ ఇండియా విమానం హాంగ్ కాంగ్ నుంచి ఢిల్లీకి వచ్చింది. సాయంత్రం 6 గంటల సమయంలో ఢిల్లీలో సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. విమానంలో ప్యాసింజర్లు కిందకు దిగారు. ఆ తర్వాత విమాన సిబ్బంది కూడా బయటకు వచ్చారు. ప్యాసింజర్లు, సిబ్బంది అలా విమానం ఖాళీ చేసి బయటకు వచ్చారో లేదో.. విమానంలో మంటలు చెలరేగాయి.

విమానంలోని పవర్ బాక్సులు, పవర్ సప్లయ్ ఉండే భాగం నుంచి మంటలు వచ్చాయి. ఈ విషయాన్ని గుర్తించిన ఎయిర్ పోర్ట్ సెక్యూరిటీ, భద్రతా అధికారులు.. వెంటనే విమానంలోని మంటలను అదుపులోకి తెచ్చారు. మంటల కారణంగా విమానం కొంత భాగం డ్యామేజ్ అయ్యింది. ఈ ఘటనపై ఎయిర్ ఇండియా స్పందించింది. ప్రయాణికులు, సిబ్బంది అంతాసురక్షితంగా ఉన్నారని తెలిపింది. విమానంలోని ఆక్సిలరీ పవర్ యూనిట్ (APU)లో మంటలు చెలరేగినట్లు గుర్తిచామంది ఎయిర్ ఇండియా.

మంటలు చెలరేగడానికి కారణమేంటన్న దానిపై దర్యాప్తు జరుగుతోందని వెల్లడించింది. 2025, జూన్ 12న అహ్మదాబాద్ లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో దాదాపు 260 మంది చనిపోయిన విషయం తెలిసిందే. ఈ విషాద ఘటన దేశపౌరులు పూర్తిగా మరువకముందే మరోసారి ఎయిర్ ఇండియా విమానంలో ప్రమాదం జరగడం ప్రయాణికుల్లో భయాందోళన రేకెత్తిస్తోంది. మొత్తానికి ఈ ఘటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకపోవడంతో ప్రయాణికులు, అధికారులు, ఎయిర్ ఇండియా ఎయిర్ లైన్స్ ఊపిరి పీల్చుకున్నారు.

# పేర్ని నానికి ఊరట.. పోలీసులకు హైకోర్టు కీలక ఆదేశాలు



**న్యూస్ డెస్క్, 22 జూలై (కెరటం న్యూస్):** మాజీ మంత్రి పేర్ని నాని కి హైకోర్టు లో ఊరట లభించింది. కృష్ణా జిల్లా పామర్రులో ఆయన రప్పా రప్పా అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో ఆయనను అరెస్ట్ చేస్తారనే ప్రచారం జరిగింది. దీంతో మరో వైసీపీ నేత కైలే అనిల్‌తో కలిసి పేర్నినాని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.. తమ పట్ల పోలీసులు తొందరపాటు చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. పేర్నినాని అభ్యర్థనను పరిశీలించిన ధర్మాసనం పోలీసులకు కీలక సూచనలు చేసింది. పేర్నినానితో పాటు కైలే అనిల్ పట్ల తొందరపాటు చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

కాగా కృష్ణా జిల్లా పామర్రులో నిర్వహించిన వైసీపీ కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి పేర్ని నాని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. టీడీపీ నేతలను ఉద్దేశించి రప్పా రప్పా అంటూ వ్యాఖ్యానించారు. దీంతో పలువురు టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పేర్ని నానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో పేర్ని నానిపై కేసు నమోదు చేశారు. త్వరలో చర్యలు తీసుకోబోతున్నారనే ప్రచారం ఊపందుకోవడంతో పేర్నినాని ఏపీ హైకోర్టును ఆశ్రయించారు.

# ప్రొఫెసర్ కుంభం మధుసూదన్ రెడ్డి కన్నుమూత

## సంతాపం వ్యక్తం చేసిన ఎంపీ వద్దిరాజు

హైదరాబాద్ బ్యూరో, 22 జూలై (కెరటం న్యూస్): ఆర్ట్స్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్, నిఖార్సయిన తెలంగాణవాది, తెలంగాణ రాష్ట్రం కోసం తపించిన ప్రొఫెసర్ కుంభం మధుసూదన్ రెడ్డి(90) మంగళవారం ఉదయం 11 గం?లకు తన స్వగృహంలో కన్నుమూసారు. ప్రొఫెసర్ మధుసూదన్ రెడ్డి స్వగ్రామం నల్లగొండ జిల్లా, మర్రిగూడ మండలం, శివన్న గూడెం గ్రామం. చిన్న శివారెడ్డి, రంగనాయకమ్మ దంపతులకు 1935లో మధుసూదన్ రెడ్డి జన్మించారు. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం నల్లగొండ జిల్లా శివన్నగూడెంలో, ఇంటర్మీడియట్ హైదరాబాద్ వి.వి.కళాశాలలో, డిగ్రీ నిజాం కళాశాలలో, ఎం.ఏ పొలిటికల్ సైన్స్ ఆర్ట్స్ కళాశాలలో చదివారు. ఆయన భార్య విమల, ఆయనకు ముగ్గురు కుమార్తెలుబీ నళిని, అరుంధతి, గాయత్రి, ఆయన అల్లుడు జస్టిస్ అభిషేక్ రెడ్డి పాట్నా హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. కుంభం మధుసూదన్ రెడ్డి అంత్యక్రియలు బుధవారం ఉదయం 10 గం.లకు ఫిల్మ్‌నగర్ మహాప్రస్థానంలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌గా ఆయన గొప్ప పాలనాధ్యక్షులుగా పని చేశారు. ఆయన ఉస్మానియా యూనివర్శిటి సోషల్ సైన్సస్ డీన్‌గా వ్యవహరించారు. ఆయన రాజనీతి శాస్త్ర భోదకుడుగా గొప్ప పేరున్నవాడు. ఆయన దేశవిదేశాలలో అనేక సెమినార్లలో పాల్గొని పలు అంశాలపై పరిశోధనా వ్యాసాలు ముద్రించారు. ఆనాడు ఆర్ట్స్ కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం అంటే విప్లవోద్యమ ప్రగతిశీల భావాల, అన్ని జాతీయ విద్యార్థి సంఘాల కేంద్రంగా ఉండేది. ఏబీవీపి నుంచి పీడీయస్‌యు, ఆర్ఎస్‌యు, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐల దగ్గర్నుంచి అనేక విద్యార్థి సంఘాలు శక్తివంతంగా ఉండేవి. ఆర్ట్స్ కళాశాలను నిర్వహించడం అంటే కత్తిమీద సాములాంటిది. అలాంటి సమయంలో ఆయన ఎంతో చాతుర్యంతో, చాకచక్యంతో ప్రిన్సిపల్‌గా రాణించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆయన అండగా ఉండేవాడు. అన్ని విద్యార్థి సంఘాల అభిమానం చూరగొన్నవాడు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారు. ఉద్యమకారుల దగ్గర్నుంచి రాజకీయ నాయకుల వరకు అందరితో కలిసి ఆయన స్వరాష్ట్ర ఉద్యమ సాధనలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. ఆయన నిగర్వి. ఆయన మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటు అని రిట్కైర్డ్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయ మాజీ వీసీ ప్రొ సులేమాన్ సిద్ధికి, ప్రముఖ సామాజికవేత్త ప్రొ.కంచె ఐలయ్య, తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, రామానందతీర్థ గ్రామీణ విద్యాసంస్థ చైర్మన్ నారా కిషోర్ రెడ్డి, మీడియా అకాడమి మాజీ చైర్మన్ అల్లం నారాయణ, మాజీ వీసీ ప్రొ.వీరారెడ్డి, హైకోర్టు మాజీ అడ్వకేట్ జనరల్ ప్రకాశ్ రెడ్డి, మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ రామచందర్‌రావు, ప్రముఖ పర్యావరణ వేత్త పురుషోత్తం రెడ్డి, తెలంగాణ ఇన్ఫర్మేషన్ సెంటర్ వ్యవస్థాపకులు తెలంగాణ ప్రభాకర్, ప్రొ. వినాయక్ రెడ్డి, ప్రొ.హరనాథ్, జస్టిస్ రాజశేఖర రెడ్డి, ఓపెన్ యూనివర్శిటి వైస్‌చాన్సిలర్ ప్రొ.ఘంటా చక్రపాణి, హైయర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ప్రొ.పురుషోత్తమ్, ప్రొ.ముత్యం రెడ్డి, స్టాన్లీ, మెథడిస్ట్ విద్యాసంస్థల సెక్రటరీ కృష్ణారావు, భారత విద్యాసంస్థల అధినేత సి.హెచ్.వేణుగోపాల్ రెడ్డి, జిహెచ్ఎమ్‌సీ జాయింట్ కమిషన్ తిప్పర్తి యాదయ్య, ప్రముఖ రచయిత సంగిశెట్టి శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రొఫెసర్లు, పలు విశ్వవిద్యాలయాల మాజీ రిజిస్ట్రార్లు, న్యాయవాదులు, నారాయణగూడలోని మధుసూదన్ రెడ్డి నివాసానికి విచ్చేసి నివాళులు అర్పించారు.



# స్టేట్ బార్ ఎన్నికల పోస్టర్ ఆవిష్కరించిన కే ఆర్ నాగరాజు



**వరంగల్/ఖమ్మం, 22 జూలై (కెరటం న్యూస్):** త్వరలో జరగబోయే తెలంగాణ స్టేట్ బార్ ఎన్నికల్లో ఇండియన్ మాల లాయర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్రి. ప్రకాశ రావు ని గెలిపిచాలని తన క్యాంపు కార్యాలయం లో పోస్టర్ ఆవిష్కరణ చేసారు. వర్ధన్నపేట ఏం ఎల్ ఏ కే ఆర్ నాగరాజు మాట్లాడుతూ రాబోయే తెలంగాణా బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పేదల బహుజనుల కోసం ప్రశ్నించే గొంతుకగా పోటీ చేస్తున్న మర్రి ప్రకాశరావు కు మద్దతు తెలిపి గెలిపించాల్సిన అవసరం ఎంత అయినా ఉన్నదని తెలిపారు.రాష్టంలో ఉన్న ప్రతీ మాల న్యాయవాది మర్రి గెలుపు కోసం పాటుపడాలని తద్వారా స్టేట్ బార్ లో మన గొంతుక గా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఇండియన్ మాల లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెంటాల ఆనంద్ డా ఎస్ వేంకటేశ్వర్లు, జమ్మి జైపాల్ విజయకుమార్, జంగం లక్ష్మణ్ రావు స్కాలర్ ఎస్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాతో ఒప్పందం అత్యంత ప్రమాదకరం

**ఖమ్మం, 22 జూలై (కెరటం న్యూస్):** అమెరికా తో స్వేచ్ఛ వ్యవసాయ వాణిజ్య ఒప్పందం భారత రైతాంగం ను అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో కి నెట్టుతుంది అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మంగళవారం సత్తెనపల్లి రామకృష్ణ భవన్ లో ధనియాకుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన తెలంగాణ రైతు సంఘం హావేలీ మహాసభ లో సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ అమెరికా ప్రభుత్వ ఆర్థిక మరియు కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు కోసం వ్యవసాయ మరియు అనుబంధ రంగాల ఉత్పత్తులను ఏలాంటి సుంకాలు లేకుండా భారత దేశం లోకి దిగుమతులు చేసుకోవాలి ఒత్తిడి చేస్తుందని అందులో భాగంగా భారత వాణిజ్య కార్యదర్శి నేతృత్వంలో అమెరికా తో స్వేచ్ఛ వ్యవసాయ వాణిజ్య ఒప్పందం చర్చలు జరుగుతున్నాయి అని అన్నారు, అమెరికా షరతులకు భారత ప్రభుత్వం అంగీకరించింది అనే మీడియా వార్తలు రైతులను భయాందోళనలకు గురి చేస్తున్నాయి అన్నారు, జన్యు మార్పిడి జీఎం విత్తనాలు, జన్యు మార్పిడి వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల వలన ప్రజల ఆరోగ్యం ప్రమాదం లో పడుతుంది అన్నారు, 1995 లో గ్యాట్ ఒప్పందం,డంకెల్ ప్రతిపాదనల పై సంతకం చేసిన భారత ప్రభుత్వం ప్రపంచ వాణిజ్య సంస్థ ( డబ్ల్యూటీఓ) షరతులు అమలుకు ఐదు సంవత్సరాల గ్రేస్ పీరియడ్ తీసుకుంది, 2000 సంవత్సరం నుంచి అమల్లోకి వచ్చినప్పటికీ వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్యం లోకి అమెరికా సంస్థలు ప్రవేశం లేకుండా భారత ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది అని, వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతల పై అనేక ఆంక్షలు విధించింది అని ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులతో భయపడి భారత ప్రభుత్వం లోగుబాటు ధోరణి తో జీరో శాతం దిగుమతి సుంకం అంగీకరిస్తే భారతదేశంలో వ్యవసాయ దారులు తీవ్రంగా నష్టపోతారు అని ప్రత్యామ్నాయ



ఉపాధి అవకాశాలు లేక రైతులు ఆత్మహత్యలు పెరిగిపోతాయి అని అన్నారు, రైతులు సంఘటిత శక్తి గా ఉద్యమం లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ కె మీరా, బోడేపూడి వీరభద్రరావు ప్రజా సంఘాల నాయకులు దొంగల తిరుపతిరావు, పిన్నింటి రమ్య, గాలి వెంకటాద్రి, కత్తుల అమరావతి, పోతురాజు వెంకటి, ధనియాకుల నాగేశ్వరరావు, నల్లమల సత్యనారాయణ, మాచర్ల గోపాల్, గాలి అంజయ్య, వేదగిరి మురహరి, కర్ల వీరస్వామి, కుర్రి రవి, రాచకొండ పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

మహాసభ అనంతరం ఖానాపురం హవేలి రైతు సంఘం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులు గా తోట నాగరాజు, కార్యదర్శి గా జట్ల ఆనందరావు, ఉపాధ్యక్షులుగా పోతురాజు వెంకటి, సహాయ కార్యదర్శిగా ధనియాకుల నాగేశ్వరరావు, కమిటీ సభ్యులుగా కుర్రి వెంకటస్వామి, వెంకన్న, కుర్రి రవి ఎన్నికయ్యారు.

# ఈ నెల 24న వైరాలో టియుడబ్ల్యుజె (ఐజెయు) ఖమ్మం జిల్లా మహాసభ

**మంత్రులను, అధికారులను ఆహ్వానించిన ఐజెయు నేతలు**

**సభకు ఖమ్మం జిల్లా జర్నలిస్టులంతా తరలి రావాలని విజ్ఞప్తి**



**ఖమ్మం టౌన్, 22 జూలై (కెరటం న్యూస్):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టియుడబ్ల్యుజె-ఐజెయు) జిల్లా మహాసభలు ఈనెల 24న వైరా పట్టణంలో జరుగుతున్నాయని ఈ సభకు జిల్లా వ్యాప్తంగా ఉన్న పాత్రికేయులంతా పాల్గొన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వర్ రావు ఒక ప్రకటనలో కోరారు. ఈ మహాసభకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క్, రాష్ట్ర సమాచార ,రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తోపాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఎంపిలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ దురిశేట్టి అనుదిప్, జిల్లా పోలీస్ కమీషనర్ సునీల్ దత్, టియుడబ్ల్యుజె (ఐజెయు ) రాష్ట్ర అధ్యక్షులు వీరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె రాంనారాయణ ఇతర జాతీయ,రాష్ట్ర నాయకులు పాల్గొంటారని వారు తెలిపారు. ఈ సభకు వైరాలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కోన్నారు. మంగళవారం వైరాలో శభరి గార్డెన్ లో సభవేధికను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిల్లా పోలీస్ కమీషనర్ సునీల్ దత్ ను కలిసి వారిరువురిని విశిష్ట అతిధులుగా ఆహ్వానించడం జరిగిందన్నారు. అదేవిధంగా జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారి ఎండి గౌస్ అలీని కూడా అతిధిగా ఆహ్వానించా మన్నారు.గడిచిన ఆరవై ఏళ్ళ నుంచి జర్నలిస్టుల హక్కులు,సంక్షేమం కోసం పోరాడుతున్న ఐజెయు మహాసభల్లో జర్నలిస్టులంతా పాల్గొన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యుజె ఐజెయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్ రావు,స్టేట్ కౌన్సిల్ మెంబర్ సామినేని మురారీ, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా నాయకులు నర్వనేని వెంకట్రావ్, సీనియర్ జర్నలిస్ట్, ఆంధ్రజ్యోతి బ్యూరో చీఫ్ నల్లజాల వెంకట్రావ్, జిల్లా నాయకులు మైస పాపారావు, నగర అధ్యక్ష కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, జనార్ధన చారి, కోశాధికారి ఏలూరి వేణు, ప్రెస్ క్లబ్ కోశాధికారి కళ్యాణ్, బుర్రి శ్రీనివాస్, వైరా ఆహ్వాన కమిటి అధ్యక్షులు కొత్త వెంకటేశ్వర్ రావు, కార్యదర్శి రాజారావు, ఎన్ టి వి శ్రీను,ఐ న్యూస్ రవి తదితరులు పాల్గొన్నారు.



# భూక్యా వీరభద్రం మోకాలు ఆపరేషన్ సక్సెస్

**ఖమ్మం సంభాద్రి హాస్పటల్లో పరామర్శించిన సిపిఎం జిల్లా వైరా డివిజన్ నేతలు**



**ఖమ్మం టౌన్, 22 జూలై (కెరటం న్యూస్):** సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం గత నెల క్రితం బైక్ పై ప్రయాణిస్తున్న సందర్భంగా రాత్రిపూట గేదెలు అడ్డురావడంతో మోకాళ్ళకు తీవ్రమైన దెబ్బలు తగిలాయి, మోకాల్లో ఉన్న లెగ్ మెంట్ ఏసిఎల్ పీసీఎల్ కట్ అయినాయి, ఖమ్మం ప్రముఖ ప్రైవేట్ వైద్యశాల స్తంభాద్రి హాస్పిటల్ చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ మేదరమెట్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఆపరేషన్ నిర్వహించారు, ఆపరేషన్ విజయవంతంగా అయిందని హాస్పిటల్ వర్గాలు తెలిపారు, మంగళవారం సంభాద్రి హాస్పిటల్ లో ఉన్న భూక్యా వీరభద్రం గారికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, వై విక్రమ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అశ్వరావుపేట మాజీ సర్పంచ్ కొక్కెరపాటి పుల్లయ్య సిపిఎం ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, సిపిఎం వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, సిపిఎం సీనియర్ నాయకులు కొప్పుల కృష్ణయ్య, సంక్రాంతి నరసయ్య, అన్నవరపు వెంకటేశ్వర్లు, వేముల సాంబశివరావు, తదితరు పరామర్శించిన వారిలో ఉన్నారు, వైద్యం ఆపరేషన్ గురించి డాక్టర్ మేదరమట్ల అనిల్ కుమార్ గారిని అడిగి తెలుసుకున్నారు.

# ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమ్మేళనం



**ఖమ్మం టౌన్, 22 జూలై (కెరటం న్యూస్):** ఎదులాపురం మున్సిపాలిటీ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్స్ సంక్షేమ సంఘం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులతో నాయుడుపేట లోని బిబిఎం పాఠశాల నందు సమావేశం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అధ్యక్షులు ఎస్ విజయ్ గారు ప్రధాన కార్యదర్శి ఎర్రమళ్ళ శ్రీనివాసరావు లు మాట్లాడుతూ వచ్చేనెల ఆగస్టు మూడో తారీకున ఏదిలాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఉద్యోగులు ఉపాధ్యాయులు మరియు పెన్షనర్స్ అందరితో సమ్మేళనం జరగబోతుంది ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, పాలేరు ఎమ్మెల్యే పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, టి ఈ జెఏసి సెక్రెటరీ జనరల్ మరియు టీజీవో రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఏలూరి శ్రీనివాసరావు ఎదులాపురం మున్సిపల్ కమిషనర్, రూరల్ ఏసిపి, రూరల్ ఎమ్మార్వో , రూరల్ సిఐ, రూరల్ ఎంపీడీవో మొదలగు వారు హాజరవుతారు అని తెలియజేశారు.ఏదిలాపురం మునిసిపాలిటీ పరిధిలో అవసరమైన మౌలిక సదుపాయాలు అనగా ఒక ఆట స్థలం, మినీ స్టేడియం, వాకింగ్ ట్రాక్ రైతు బజారు గ్రంథాలయం, సీసీ రోడ్ల నిర్మాణం మిషన్ భగీరథ నీళ్ల డ్రైనేజీ కాలువలు నిర్మాణం విద్యుత్ సమస్యల పరిష్కారం మొదలగు విషయాలపై ఈ సమావేశం నందు చర్చించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎర్రమళ్ళ శ్రీనివాసరావు, కోశాధికారి మల్లయ్య , ఆర్గనైజింగ్ కార్యదర్శి దేవయ్య, ప్రచార కార్యదర్శి పెరుమాళ్ళ శ్రీనివాసులు ఉపాధ్యక్షులు శోభనాయక్, రాములు గుంటి మల్లికార్జున్, కిషన్ నాయక్, సాయిబాబా మల్లికార్జున్ శంకర్ పాల్గొన్నారు.

# అతడిని కాదని అన్షుల్‌ను ఎలా ఎంపిక చేస్తారు?: సెలక్టర్లపై ఫైర్

స్పోర్ట్స్ న్యూస్ ,22 జూలై (కెరటం న్యూస్): ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు నేపథ్యంలో ఆల్‌రౌండర్ అన్షుల్ కాంబోజ్ కొత్తగా టీమిండియాలోకి చేరాడు. స్టార్ క్రికెటర్లు గాయాల పాలు కావడంతో ఈ హర్యానా ఆటగాడికి ఈ మేర బంపరాఫర్ దక్కింది. పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి సిరీస్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌లకు దూరం కాగా.. పేసర్ అర్ష్‌దీప్ సింగ్ నాలుగో టెస్టుకు అందుబాటులో లేకుండా పోయాడు. మరోవైపు.. మరో



పేసర్ ఆకాశ్ దీప్ ఫిట్‌నెస్‌పై కూడా స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ రైటార్మ్ పేసర్ అన్షుల్ కాంబోజ్‌ను జట్టులోకి తీసుకుంది. ఈ విషయాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి సోమవారం అధికారికంగా వెల్లడించింది.

అతడిని కాదని అన్షుల్‌ను ఎలా ఎంపిక చేస్తారు?

అయితే, సెలక్టర్లు తీసుకున్న ఈ నిర్ణయం సరికాదంటూ భారత మాజీ క్రికెటర్, కామెంటేటర్ ఆకాశ్ చోప్రా విమర్శించాడు. హర్షిత్ రాణాను కాదని అన్షుల్ కాంబోజ్‌ను ఎలా పిలిపించారని ప్రశ్నించాడు. అసలు టీమిండియాలో ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కాదని ఆగ్రహం వ్యక్తం చేశాడు.

ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు

కాగా ఇంగ్లండ్-'ఎ' జట్టుతో జరిగిన రెండు మ్యాచ్‌ల అనధికారిక టెస్టు సిరీస్‌లో హర్షిత్ రాణా, అన్షుల్ కాంబోజ్ మెరుగైన ప్రదర్శన కనబరిచారు. అయితే, ఇంగ్లండ్‌తో టెండుల్కర్- ఆండర్సన్ ట్రోఫీ జట్టులోకి అదనపు ఆటగాడిగా హర్షిత్ రాణాను తీసుకుని.. అక్కడే ఉంచింది యాజమాన్యం.

అయితే, హర్షిత్ ఎంపికపై విమర్శలు వచ్చిన నేపథ్యంలో.. అతడు కొన్ని రోజులకే స్వదేశానికి తిరిగి రావడం చర్చనీయాంశమైంది. ఇప్పుడు ఇలా గాయాల బెడద నేపథ్యంలో అన్షుల్‌ను పిలిపించింది మేనేజ్‌మెంట్.

అపుడు హర్షిత్.. ఇపుడు అన్షుల్ ఎందుకు?

ఈ నేపథ్యంలో ఆకాశ్ చోప్రా మాట్లాడుతూ.. "హర్షిత్ రాణా లేడు. ఇపుడేమో ఇతడు. అసలు టీమిండియాలో ఏం జరుగుతోందని మనమంతా ఆశ్చర్యపోవాలా? ఎవరు జట్టులోకి వస్తారు? ఎవరిని ఎప్పుడు తీసేస్తారు? అన్న విషయాలను ఏ ప్రాతిపదికన నిర్ణయిస్తున్నారు?

భారత్-ఎ తరఫున ప్రదర్శన గురించి మాట్లాడితే అన్షుల్ కాంబోజ్ మెరుగ్గా ఆడాడు. కానీ మీరు ముందుగా హర్షిత్ రాణాను టీమిండియాతో కొనసాగించేందుకు నిర్ణయించుకున్నారు.

అలాంటపుడు అదే నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సింది. కానీ ఇప్పుడు అతడు స్వదేశానికి వచ్చేశాడు. అన్షుల్ కాంబోజ్‌ని అక్కడే ఉంచారు. అంతా గందరగోళంగా ఉంది. మేనేజ్‌మెంట్‌కు ఈ విషయంలో స్పష్టత ఉండవచ్చేమో గానీ.. మనకు ఎవరూ ఏమీ చెప్పరు.

అయినా, టీమిండియాలో ఇలా జరుగుతూనే ఉంటుంది. ఇందులో పెద్దగా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. ఏదేమైనా అన్షుల్ కాంబోజ్ జట్టులోకి వచ్చేందుకు అర్హుడు. ఎట్టకేలకు అతడు టీమిండియాతో చేరాడు" అని పేర్కొన్నాడు.

వీరి ప్రదర్శన ఇలా

కాగా ఆస్ట్రేలియాతో బోర్డర్-గావస్కర్ ట్రోఫీ 2024-25 సందర్భంగా 23 ఏళ్ల హర్షిత్ రాణా టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. ఆ సిరీస్‌లో రెండు మ్యాచ్‌లు ఆడి నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఇక ఇంగ్లండ్-ఎ జట్టుతో అనధికారిక టెస్టు సిరీస్‌లో మాత్రం అతడు రెండు మ్యాచ్‌లలో కలిపి కేవలం ఒక్క వికెట్ మాత్రమే తీయగలిగాడు.

మరోవైపు.. 24 ఏళ్ల అన్షుల్ కాంబోజ్ నార్తాంప్టన్‌లో జరిగిన రెండో టెస్టులో నాలుగు వికెట్లతో సత్తా చాటాడు. అంతేకాదు.. రెండో ఇన్నింగ్స్‌లో తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్ చేసి అజేయ అర్ధ శతకం (51)తో మెరిశాడు. కాగా ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో గిల్ సేన ప్రస్తుతం 1-2తో వెనుకబడి ఉంది. ఇరుజట్ల మధ్య మాంచెస్టర్ (జూలై 23-27)లో నాలుగో టెస్టు నిర్వహణకు షెడ్యూల్ ఖరారైంది.

ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టుకు టీమిండియా (అప్‌డేటెడ్)

శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వికెట్ కీపర్ %డ% వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, కుల్దీప్ యాదవ్, అన్షుల్ కాంబోజ్.

# పెద్ది సినిమా కోసం ఏకంగా ఆ ఊరినే నిర్మిస్తున్నారా?



మూవీ న్యూస్, 22 జూలై (కెరటం న్యూస్): మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం గ్లోబల్ స్టార్‌గా దూసుకుపోతున్నాడు. 'ఆర్ఆర్ఆర్' తరువాత ఆయనకు అంతర్జాతీయ గుర్తింపు లభించడంతో ఇప్పుడు చరణ్ తీసే సినిమాలన్నింటిని పాన్ ఇండియా రేంజ్‌లో విడుదల చేస్తున్నారు. ఆ మధ్యలో వచ్చిన గేమ్ ఛేంజర్ ఆశించినంత వర్క్ అవుట్ కాకపోయినా, చరణ్ మాత్రం వెనకడుగు వేసే పరిస్థితిలో లేడు. ప్రస్తుతం ఆయన పెద్ది అనే మాస్ అండ్ మోటివేషనల్ మూవీపై ఫోకస్ పెట్టారు. 'ఉప్పెన'తో సెన్సేషనల్ డెబ్యూ ఇచ్చిన బుచ్చిబాబు సాన డైరెక్షన్‌లో ఈ మూవీ తెరకెక్కుతోంది. కథకు ప్రధానమైన సన్నివేశాలు విజయనగరం నేపథ్యం చిత్రీకరించాల్సి ఉంది. అయితే అక్కడి వాతావరణం షూటింగ్‌కు అనుకూలంగా లేకపోవడంతో, ఆ సీన్లన హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సెట్ వేసి తీయాలని చిత్రబృందం నిర్ణయించింది. ఈ సెట్ కోసం ఏకంగా రూ. 5 కోట ఖర్చు చేస్తున్నట్టు సమాచారం. ఈ సినిమా రూరల్ స్పోర్ట్స్ డ్రామా కాగా, ఇందులో రామ్ చరణ్ ఒక క్రికెటర్ పాత్రల కనిపించబోతున్నాడు. ఇప్పటికే విడుదలైన చిన్న గ్లింప్స్‌కి అభిమానుల నుంచి భారీ స్పందన వచ్చింది. కథ, లు విభిన్నంగా ఉండనుందని తెలుస్తుంది. వచ్చే ఏడాదిలో ఈ మూవీ రిలీజ్ కానుంది. చిత్రానికి ఆస్కార్ విన్నిం కంపోజర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ట్యూన్స్ రెడీ అయ్యాయని సమాచారం.


# నా మార్పుకు కారణం రజినీకాంత్..



మూవీ న్యూస్, 22 జూలై (కెరటం న్యూస్): దక్షిణ భారత చిత్రసీమలో స్నేహానికి నిలువెత్తు నిదర్శనంగా సూపర్‌స్టార్ రజనీకాంత్, కలెక్షన్ కింగ్ మోహన్‌బాబు మధ్య , స్నేహ బంధం ఇప్పటికీ కొనసాగుతోంది. అది కూడా ఈ ఇద్దరు 50 ఏళ్లుగా ఈ గాఢమైన అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. ఇటీవల మోహన్‌బాబు ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నారు. జీవితంలో ఇద్దరు ఎదురుకున్న కష్టాలను కూడా ఆయన పంచుకున్నారు.

మోహన్ బాబు మాట్లాడుతూ.. 'రజనీకాంత్ గొప్ప మనిషి, అతడితో నాకు ఉన్న బంధం మాటల్లో చెప్పలేనిది. మా మధ్య స్నేహం 50 ఏళ్ల క్రితం మద్రాసు ప్లాట్‌ఫామ్‌పై తొలిసారి కలుసుకున్నప్పటి నుంచి, ఇప్పటి వరకు కొనసాగుతూనే ఉంది. అప్పట్లో ఇద్దరికి సినిమాల్లో అవకాశాలే లేవు. కానీ ఆ స్నేహం కాలాన్ని జయించి, నేటికీ అలాగే ఉంది. ఇప్పటికీ రోజుకు కనీసం మూడు, నాలుగు మెసేజ్‌లు ఒకరికొకరు పంపుకుంటూ ఉంటాం. ఇటీవల రజనీకాంత్‌ను కలిసినప్పుడు, ఆయన ఒక సలహా ఇచ్చారు.. నాకు గతంలో చాలా కోపం ఉండేది. కానీ పుస్తకాలు చదివిన తర్వాత ఆ కోపాన్ని వదిలేశాను. "నువ్వు చదువు, కానీ చదవడం మాత్రమే కాకుండా అందులోని సారాంశాన్ని అర్థం చేసుకుని నీ కోపాన్ని వదిలేయ్.. అని రజనీకాంత్ చెప్పాడు. ఆ మాటలు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి. అప్పటి నుండి కాస్త కోపం కూడా తగ్గింది' అని ఆయన పేర్కొన్నారు. ప్రజంట్ ఈ మాటలు వైరల్ అవుతున్నాయి.

# అజిత్‌కు తప్పిన ప్రమాదం



మూవీ న్యూస్, 22 జూలై (కెరటం న్యూస్): సినిమాల్లో డూప్ లేకుండా యాక్షన్ సీక్వెన్స్ చేస్తూ.. మరోవైపు కారు రేసింగ్‌లో కూడా సత్తా చాటుతూ అభిమానుల్ని ఆకట్టుకుంటున్నారు తమిళ హీరో అజిత్. తాజాగా ఇటలీలో జరిగిన జీటీ4 యూరోపియన్ సిరీస్ రేసులో పాల్గొన్నారాయన. ఇందులో భాగంగా ట్రాక్‌పై దూసుకెళ్లిన ఆయన కారు ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో అజిత్‌కు గాయాలేమి కాలేదు.. కానీ దీని తర్వాత ఆయన చేసిన పనిపై నెట్టింట్లో అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. కారు ప్రమాదానికి గురైన తర్వాత ట్రాక్‌పై ఉన్న శిథిలాలను తొలగించడానికి అక్కడి సిబ్బందికి సహాయం చేశారు అజిత్. దీనికి సంబంధించిన వీడియోను జీటీ4 యూరోపియన్ సిరీస్ ఎక్స్‌లో పంచుకుంది. "ప్రమాదం వల్ల రేసు నుంచి తప్పుకున్నప్పటికీ.. ట్రాక్‌ను శుభ్రం చేయడంలో సాయం చేసి ఇప్పటికీ సంతోషంగానే ఉన్నారు. దీంతో అజిత్‌పై గౌరవం రెట్టింపయ్యింద"నే వ్యాఖ్యల్ని జోడించింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట్లో సందడి చేస్తుంది.

# త్వరలో ధనుష్-నిత్యల ప్రేమ కబుర్లు



మూవీ న్యూస్, 22 జూలై (కెరటం న్యూస్): 'కుబేర' సినిమాతో ఇటీవలే మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు ధనుష్. ప్రస్తుతం ఇటు దర్శకుడిగా.. మరోవైపు నటుడిగా శక్తిమంతమైన కథలతో ప్రయాణిస్తున్న ఆయన.. 'ఇడ్లీ కడై' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. నిత్యామేనన్ కథానాయిక. ధనుష్ దర్శకత్వంలో రాబోతుందీ చిత్రం. తాజాగా ఈ నెల 28న ధనుష్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా ప్రచార కార్యక్రమాలను మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఈ చిత్ర మొదటి సింగిల్‌ను విడుదల చేయనున్నారని.. ధనుష్, నిత్యల ప్రేమ గురించి తెలిపేలా ఈ రాబోయే గీతాన్ని తీర్చిదిద్దినట్లు సమాచారం. డాన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమాలో ప్రకాశ్ రాజ్, షాలినీ పాండే తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం అక్టోబరు 1న రానుంది.